

ఘనంగా జహంగీర్ పీర్ దర్గా ఉర్సు



ఇబ్రహీంపట్నం, జనవరి 21 : ఇబ్రహీంపట్నం సమీపంలోని చెర్లపటేల్ గూడ రోడ్డులో గల జహంగీర్ పీర్ దర్గాలో ఉర్సును ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సతీమణి ముకుందమ్మ, తనయుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. దర్గాపై చాదర్ కప్పి ప్రార్థనలు చేశారు.



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రతీ పేద ఇంటికి ఆరు సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీ ప్రజల్లోకి బలంగా తీసుకుపోయింది. అనుకున్నట్టే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అనంతరం ఆరు గ్యారంటీ స్కీములకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. అయితే ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల్లో ఎక్కువగా 18ఏళ్లు నిండిన ప్రతీ పేద మహిళకు నెలకు రూ.2,500 ఇచ్చే(నగదు బదిలీ), దాని తరువాత రూ.500కే గ్యాస్ సిలిండర్ స్కీమ్ (మహాలక్ష్మి)లకే ఎక్కువ మంది మొగ్గు చూపారు. వీటి తరువాత ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంటు పథకాలు ఉన్నాయి. ప్రజా పాలనలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,22,701 దరఖాస్తులు రాగా వాటిల్లో వివిధ స్కీములకు 42,24,636 అభ్యర్థనలొచ్చాయి.

మహాలక్ష్మిపై ఆశలు

'అభయహస్తం' అమలుకు ఎదురుచూపులు





పేదలకే ప్రాధాన్యం?

సహజంగా ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం ప్రవేశపెట్టినా మొదట పేదలను దృష్టిలో పెట్టుకొనే స్కీముల రూపకల్పన చేస్తుంది. వారి తరువాతనే మధ్య తరగతి, ఉన్నత వర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తుంది. దీన్ని బట్టి చూస్తే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమంలో ప్రతీ ఇంటి నుంచి దరఖాస్తులు స్వీకరించినప్పటికీ మొదట ఫుడ్ సెక్యూరిటీ కార్డు(రేషన్ బియ్యం తీసుకునే వారు) ఉన్న మహిళలకు మొదటి ప్రాధాన్యం ఇస్తుందనే చర్చ కొనసాగుతుంది. దీనినే ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉంది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా కొత్తగా రేషన్ కార్డులను ఇవ్వకపోవడం, కొన్ని కుటుంబాలు వేరు పడటం, కార్డు ఉన్నా పిల్లల పేర్లు ఎక్కక పోవడం, అప్పట్లోనే చాలా మందికి కార్డులు ఇవ్వకపోవడం, అలాగే కొత్తగా పెళ్లయిన కుటుంబాలకు ఆహార భద్రత కార్డులు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. నిజంగా పేదలే అయినా వారికి ఫుడ్ సెక్యూరిటీ కార్డు లేదనే సాకుతో పథకాలను వర్తింపజేయకుంటే అర్హులు నష్టపోయే ఆస్కారం ఉంది. కాబట్టి లబ్ధిదారుల ఎంపిక గ్రామసభ నిర్వహించి చేపడితే రేషన్ కార్డు ఉన్నా, లేకున్నా నిజమైన అర్హులకు పథకాలు వర్తిస్తాయనే చర్చ గ్రామాల్లో సాగుతోంది. అయితే ప్రభుత్వం ఈ ప్రక్రియంతా పూర్తి చేయడానికి కొంత సమయం పట్టే అవకాశం లేకపోలేదు. రానున్నది సార్వత్రిక ఎన్నికల కాలం. ఎన్నికల షెడ్యూల్, కోడ్ అమల్లోకి రాకముందే కొన్ని పథకాలనైనా అమలు చేసి లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు రాబట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో రానున్న రెండు నెలల్లో కొన్ని ఆరు గ్యారంటీల్లో కొన్నింటినైనా అమలు చేయాలనే నిశ్చయంతో ఉంది.

జిల్లా	వచ్చిన దరఖాస్తులు	అభ్యర్థనలు
వికారాబాద్	2,84,275	13,24,270
రంగారెడ్డి	5,10,709	20,99,208
మేడ్చల్-మల్కాజిగిరి	2,27,717	8,01,158
మొత్తం	10,22,701	42,24,636

- ప్రతీ పేద మహిళకు నెలనెలా రూ.2,500 స్కీంకు 9,14,678 అప్లికేషన్లు
- రూ.500కే ఎల్పీజీ సిలిండర్‌కు 8,51,950 అభ్యర్థనలు
- ఇందిరమ్మ ఇళ్లకు 8,00,477.. 200 యూనిట్ల ఉచిత కరెంట్‌కు 7,90,863 విజ్ఞాపనలు
- గ్యారంటీ పథకాలపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలకు భారీ ఆశలు
- మార్గదర్శకాలు విడుదలైతేనే అర్హుల్లో స్పష్టత

వికారాబాద్,(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/రంగారెడ్డి అర్బన్, జనవరి 21 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. అభయహస్తం ఆరు గ్యారంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి భారీ సంఖ్యలో దరఖాస్తులొచ్చాయి. ఈ దరఖాస్తుల్లో అత్యధికంగా మహాలక్ష్మి(నగదు బదిలీ), ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి పథకాలకు అభ్యర్థనలు వచ్చాయి. మహాలక్ష్మి స్కీమ్ కింద మహిళకు నెలనెలా రూ.2,500, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలకు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆరు గ్యారంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలనూ వర్తింపజేయాలని కోరుతూ ప్రజల నుంచి వచ్చిన 10,22,701 దరఖాస్తుల్లో వివిధ పథకాలకు మొత్తం 42,24,636 అభ్యర్థనలున్నాయి. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ వికారాబాద్ జిల్లాలో పూర్తిచేసి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ)కు అప్పగించగా, అభ్యర్థనల పరిశీలన కొనసాగుతోంది. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తుల్లో పొందుపరిచిన వివరాలన్నీ సవ్యంగా ఉన్నట్లు ధ్రువీకరించిన తరువాత అర్హుల ఎంపికకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ కానున్నట్లు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి విదేశాల నుంచి రాగానే దరఖాస్తులపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఏ పథకం కోసం ఎన్నెన్ని దరఖాస్తులొచ్చాయి, అమలు చేసేందుకు ఏ మేర నిధులు కేటాయించాల్సి వస్తుందనే విషయమై సీఎం తన మంత్రివర్గ సహచరులతో కూలంకుశంగా చర్చించనున్నట్లు తెలిసింది.

క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తరువాతే...

ఇదిలా ఉంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అభయ హస్తం గ్యారంటీలు, ఇతర సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఆరు గ్యారంటీలతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలను వర్తింపజేసేందుకు ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో సబ్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అభయహస్తం దరఖాస్తుల్లోని వివరాలను ప్రజాపాలన పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తయిన తరువాత ప్రజల దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టనున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అభయహస్తం గ్యారంటీలకు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు దరఖాస్తు చేసుకునేందుకు నియమ నిబంధనలంటూ ఏమీ లేకపోవడంతో పేద మధ్య తరగతులకు చెందిన వారితో పాటు ధనవంతులూ దరఖాస్తు చేసుకున్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలందరికీ ఉచిత ప్రయాణం అనుమతించినట్లుగానే కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వర్తింపజేస్తుందనే ఆశాభావంతో చిన్నాపెద్దా, పేద ధనిక అంటూ తేడా లేకుండా చాలా వరకు అందరూ దరఖాస్తు చేసుకున్నారు. సాధారణంగా ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, ప్రభుత్వేతర సంస్థల ఉద్యోగులను అనర్హులుగా పరిగణిస్తారు. అలాగే కొంత మేరకు ఆదాయ పన్నుదారులను కూడా పేదలకు అమలు చేసే సంక్షేమ పథకాల నుంచి మినహాయిస్తారు. సంక్షేమ పథకాల అమలుకు ప్రధానంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారినే పరిగణలోకి తీసుకుంటారు. తెల్లరేషన్ కార్డులను ప్రాతిపదికగా లెక్కిస్తారు. కాగా ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీలకు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు చాలా వరకు ప్రభుత్వ ఉద్యోగులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యంగా 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు స్కీమ్ తమకు కూడా వర్తిస్తుందని ఉద్యోగులు, ట్యాక్స్ పేయర్లు, తెల్ల రేషన్ కార్డు లేని వారు భావిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీములకు ప్రభుత్వ ఉద్యోగులు దరఖాస్తు చేసుకోకూడదనే నియమమేదీ లేకపోవడంతో వారి కుటుంబీకుల సైతం దరఖాస్తు చేసుకున్నారు. అయితే అభయహస్తం ఆరు గ్యారంటీలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు ఎవరిని అర్హులుగా పరిగణిస్తారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గ్యారంటీలు, పథకాలు వర్తింపజేసేందుకు పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు విడుదల అయితేనే అర్హులు ఎవరనేది స్పష్టత రానుంది.

ఉమ్మడి జిల్లా పరిధిలో వచ్చిన అభ్యర్థనల వివరాలు

పథకం	వికారాబాద్	రంగారెడ్డి	మేడ్చల్-మల్కాజ్‌గిరి
మహిళలకు నెలనెలా రూ.2,500	2,59,441	4,56,839	1,98,398
రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్	2,27,773	4,32,676	1,91,501
ఇందిరమ్మ ఇళ్లు	2,64,242	3,86,695	1,49,540
200 యూనిట్ల ఉచిత విద్యుత్	2,09,560	3,99,866	1,81,437
రైతు భరోసా(రూ.15వేలు)	1,54,239	1,85,905	28,858
కౌలు రైతులకు రూ.15వేలు	5,080	7,362	1,606
రైతు కూలీలకు రూ.12వేలు	1,46,390	1,24,518	7,531
అమరుల కుటుంబాలకు 250 గజాలు	265	1,031	468
ఉద్యమకారులకు 250 గజాలు	1,027	3,297	1,654
దివ్యాంగుల పింఛన్లు	6,546	13,271	5,524
ఇతర పింఛన్లు	49,707	87,745	34,641
మొత్తం	13,24,270	20,99,208	8,01,158

ముగిసిన ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ

(రంగారెడ్డి అర్బన్, జనవరి 21): జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. అర్హులైన యువతీ యువకులు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 3,369 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫారం-6 ద్వారా 1,871, ఫారం-7 ద్వారా 808, ఫారం-8 ద్వారా 1,227 దరఖాస్తులు వచ్చాయి. పోలింగ్ కేంద్రానికి ఒకరు చొప్పున బీఎల్వోలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఏఈఆర్వోలు 1,303, డీఈఆర్వోలు 21 మంది ప్రత్యే ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆమనగల్లులో దరఖాస్తు స్వీకరిస్తున్న బీఎల్వోలు

నియోజకవర్గాలు : 08
పోలింగ్ కేంద్రాలు : 3,369
ఫారం 6కు వచ్చిన దరఖాస్తులు : 1,871
ఫారం-7కు : 808
ఫారం-8కు : 1,227
పాల్గొన్న బీఎల్వోలు : 3,369
ఏఈఆర్వోలు : 1,303
డీఈఆర్వోలు : 21

నియోజకవర్గం	ఫారం-6	ఫారం-7	ఫారం-8
ఇబ్రహీంపట్నం	171	128	269
ఎల్బీనగర్	145	88	160
మహేశ్వరం	72	41	33
రాజేంద్రనగర్	342	176	118
శేరిలింగంపల్లి	700	09	414
చేవెళ్ల	224	326	88
కల్వకుర్తి	125	37	112
షాద్‌నగర్	92	03	33



చేవెళ్లలో కాషాయ జెండాలు కడుతున్న బీజేపీ నాయకులు

రామ నామస్మరణతో

మార్మోగుతున్న గ్రామాలు

అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పూజలు

చేవెళ్ల, జనవరి 21: అయోధ్యలో సోమవారం శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం, బాల రాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని చేవెళ్ల డివిజన్‌లోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో ఉత్సవ వాతావరణం నెలకొంది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర్ పిలుపు మేరకు బీజేపీ నాయకులు, రామ భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హనుమాన్ ఆలయాల్లో పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. సీతారాముల వారి శోభాయాత్ర, హనుమాన్ చాలీసా పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఉదయం పది గంటల నుంచే అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఎల్ఈడీ ద్వారా వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి గ్రామంలో ఉన్న ఆంజనేయ ఆలయం వరకు శ్రీరాముని శోభాయత్ర చేపట్టనున్నారు. ఇప్పటికే గ్రామాల్లో అన్ని వీధుల్లో కాషాయ జెండాలు రెపరెపలాడుతున్నాయి.

నేడు మాజీ ఉప రాష్ట్రపతి, ఇద్దరు గవర్నర్ల పర్యటన

శంషాబాద్ రూరల్, జనవరి 21 : మండలంలోని ముచ్చింతల్‌లో గల స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆవరణలో సోమవారం ఉదయం సీతారామచంద్ర స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, హర్యానా, మిజోరాం గవర్నర్‌లు పాల్గొంటారని ట్రస్ట్ కార్యదర్శి బి.సుబ్బారెడ్డి ఆదివారం తెలిపారు. నేటి ఉదయం 9గంటల నుంచే కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

త్వరలోనే పాత జాతీయ రహదారి నిర్మాణ పనులు

షాద్‌నగర్, జనవరి 21: పాత జాతీయ రహదారి నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ చౌరస్తా నుంచి సోలిపూర్ వరకు పాడుబడిన పాత జాతీయ రహదారిని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్తూరు నుంచి సోలిపూర్ వై జంక్షన్ వరకు చేపట్టిన నిర్మాణ పనులను షాద్‌నగర్ చౌరస్తా వరకే చేసి వదిలేశారన్నారు. సదరు కాంట్రాక్టర్‌కు పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతోనే సోలిపూర్ వరకు పనులు చేయలేన్నారు. ఎన్నికల ముందు షాద్‌నగర్ నుంచి సోలిపూర్ వరకు పనులకు శంకుస్థాపన చేశారని, అనంతరం రోడ్డు నిర్మాణ పనుల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. తాను ఆర్అండ్‌బీ అధికారులతో చర్చించి పెండింగ్‌లో ఉన్న నిధులను దశలవారీగా చెల్లిస్తామని, అసంపూర్తిగా ఉన్న పాత జాతీయ రహదారి పనులను చేపట్టాలని కోరామని తెలిపారు. దీనికి ఆ శాఖ అధికారులు అంగీకారం తెలపారని, త్వరలోనే రోడ్డు పనులు చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులను తీరుస్తామని ఎమ్మెల్యే వివరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్, వంశీచంద్‌రెడ్డి

అధికారులపై రైతు వేదికల నిర్వహణ భారం

- 21 నెలలుగా విడుదల కాని నిధులు

యాచారం, జనవరి 21: రైతులతో సమావేశాలు నిర్వహించి, సమస్యలను తెలుసుకొని పరిష్కారాలు చూపే వేదికలుగా ఉండాలని గత ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికల నిర్వహణ వ్యవసాయశాఖ అధికారులకు భారంగా మారింది. యాచారం, చౌదర్‌పల్లి, మేడిపల్లి, మాల్ గ్రామాల్లో రైతు వేదికలు నిర్మించారు. ఒక్కో వేదిక నిర్మాణానికి రూ.25లక్షలు వెచ్చించారు. నిర్వహణ కోసం 2021 మే నుంచి 2022 మే వరకు ప్రతినెలా రూ.9వేల చొప్పున నిర్ణయించారు. అయితే రైతువేదికల నిర్వహణ బిల్లులను మాత్రం ప్రభుత్వం చెల్లించలేదు. 21నెలలుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. వ్యవసాయశాఖ అధికారులు రైతు వేదికల్లో అందుబాటులో ఉంటూ రైతుల సమస్యలను తీరుస్తున్నారు. సాగులో మెలకువలపై రైతులతో చర్చిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులకు అందేలా చూస్తున్నారు. రైతుబంధు, రైతుబీమా దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. అయితే రైతువేదికల నిర్వహణ భారం తమపై పడుతోందని వ్యవసాయాధికారులు వాపోతున్నారు. నెలకు రూ.800 మేర విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడంతో జిల్లా వ్యవసాయాధికారులేకార్యాలయ విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు.



యాచారంలోని రైతు వేదిక

అస్తవ్యస్తంగా రైతు వేదికల నిర్వహణ

రైతువేదికల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గాలి దుమారం వస్తే రైతు వేదికలో దుమ్ముధూళీ పేరుకుపోతోంది. వర్షం కురిస్తే సైడ్ వాల్స్ నుంచి నీరు లోపలికి వస్తోంది. కొన్ని ఉరుస్తున్నాయి. వేదికల నిర్మాణంలో నాణ్యత పాటించలేదని, ప్లానింగ్ సరిగ్గా లేదని రైతులు పేర్కొంటున్నారు. రైతు వేదిక గోడలను రెండు వైపులా ఇటుకలతో నిర్మిస్తే బాగుండేదని, సైడ్ వాల్స్‌కు కేవలం గ్రిల్స్, షీట్లు ఏర్పాటు చేయడంతో అంతా బయలే అన్నట్టుగా ఉందని గ్రామస్తులు అంటున్నారు.

కొత్త ప్రభుత్వం పట్టించుకుంటుందా?

రైతు వేదికలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుంటుందా అని రైతులు, వ్యవసాయాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతువేదిక నిర్వహణకు నెలకు రూ.9వేల చొప్పున మండలంలోని వేదికలన్నింటికీ కలిపి నెలకు రూ.36 వేలు చెల్లించాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా 21 నెలలుగా రైతువేదికల నిర్వహణ బిల్లులను చెల్లించలేదు. రూ.7.56లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. విద్యుత్ బిల్లులను కొత్త ప్రభుత్వం ఇస్తుందో, లేదోనని అధికారులు కలత చెందుతున్నారు.

రైతు సమన్వయ సమితులుండేనా.. ఊడేనా?

రైతు వేదికలను నిర్మించిన బీఆర్ఎస్ ప్రభుత్వం మండల, జిల్లా రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసి వాటికి చైర్మన్లను నియమించింది. వారిలో దాదాపు అందరూ బీఆర్ఎస్ నాయకులే ఉన్నారు. తాజాగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సమితులకు మంగళం పాడుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

వేదికలతో రైతులకు ఒరిగిందేమీ లేదు



రైతు వేదికలతో రైతులకు ఎలాంటి మేలు కలగలేదు. వర్షం కురిసిన సమయంలో ఇందులో ఉంటే తడిసిపోవాల్సిందే. వేదికలను ఊడ్చే వాళ్లయినా లేరు. చెత్తంతా జమై పాడుబడ్డ ఇంటిలా మారాయి. గోడలు కట్టకపోవడంతో వాటిల్లో అధికారులు పనిచేసే సమయంలో పెద్ద గాలి వీస్తే కాగితాలన్నీ ఎగిరిపోతాయి. వేదికల నిర్మాణం కూడా సరిగా లేదు. అంతా పైపూత మాదిరిగా చేశారు.

- అచ్చన జంగయ్య, రైతు/సర్పంచ్, గడ్డమల్లాయగూడ

ఔటర్ జంక్షన్ వద్ద తనిఖీలు

ఆదిభట్ల, జనవరి 21: ఆదిభట్ల పరిధి బొంగ్లూరు ఔటర్ జంక్షన్ వద్ద ఆదివారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేసి ఔటర్ సర్వీస్ రోడ్డు బ్రిడ్జి కింద పడేసిన ఉదంతంతో పాటు గంజాయి తరలింపు వంటి సంఘటనలను దృష్టిలో ఉంచుకొని రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు తనిఖీలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు. ఆకస్మిక తనిఖీలతో అక్రమాలు, నేరాలను కొంత మేర అదుపు చేయొచ్చన్నారు. 790 వాహనాలను తనిఖీ చేయడంతో పాటు అనుమానిత వ్యక్తుల వివరాలను బయోమెట్రిక్ ఆధారంగా తెలుసుకున్నారు. తనిఖీల్లో కమిషనరేట్ క్రైమ్ డీసీపీ అరవిందబాబు, మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు, గ్రీన్ ఫార్మాసిటీ సీఐ రామాంజనేయులు, ఆదిభట్ల ఎస్సైలు శ్రీనివాస్ రావు, రాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.




వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

బొంరాస్‌పేట్, జనవరి 21: మండలంలోని వడిచర్ల గ్రామానికి చెందిన నవీన్‌గౌడ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.1,25000 ఎల్‌వోసీ చెక్కును ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జి.నర్సింహులుగౌడ్ ములుగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, అంజిలొరెడ్డి, దేశ్యానాయక్, నర్సింహులునాయుడు, మల్లేశ్, గోపాల్‌రెడ్డి, అంజిగౌడ్, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.





వీధికుక్కలను అడవిలో వదిలిన సర్పంచ్, సెక్రెటరీపై కేసు

మేడ్చల్ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల బెడదనుంచి గ్రామస్తులను రక్షించటానికి సర్పంచ్, కార్యదర్శి చేసిన ప్రయాస బెడిసికొట్టింది. చివరికి నోరు లేని మూగ జీవులను అడువుల్లోకి వదిలేయడంపై ఎనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సంస్థవారు పోలీసులను ఆశ్రయించారు. సర్పంచ్, కార్యదర్శిపై కేసు నమోదు చేయించారు. మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మురాహరిపల్లి గ్రామంలో కుక్కల బెడద అధికమైంది. దీంతో గతనెల 11వ తేదీన పంచాయతీ వారు కుక్కలను పట్టి గ్రామానికి దూరంగా అడువుల్లో వదిలారు. విషయం తెలుసుకున్న పీసీఏ ఎనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ గౌతమ్, అసిస్టెంట్ లక్ష్మీప్రసన్నలు ఈ విషయంపై సర్పంచ్‌ను ఆరాతీయగా నిజమేనని చెప్పారు. దీంతో వారిపై మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు తగిన విచారణ జరిపి కేసు నమోదు చేశారు. వీధికుక్కల బెడద నుంచి తప్పించుకోవడానికి వాటిని పట్టి చంపడంగానీ, ఆకలి దప్పికతో చావడానికి అడవుల్లో వదిలేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు.

ముగిసిన కిసాన్ మహోత్సవాలు


వ్యవసాయ రంగంలో ప్రతిభ కనబరిచిన వారిని సన్మానిస్తున్న నిర్వాహకులు

మేడ్చల్ టౌన్, జనవరి 21మల్లారెడ్డి అగ్రికల్చర్ స్కూల్ ఆఫ్ సైన్స్, ఏరువాక ఫౌండేషన్ వారు రెండు రోజులుగా నిర్వహిస్తున్న కిసాన్ మహోత్సవాలు ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి ఏరువాక ఫౌండేషన్ వారు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన నిపుణులతో పాటు అనుబంధంగా ఉండే రంగాలకు సంబంధించిన నిపుణులు పాల్గొని తమ అనుభవాలను ఇతరులతో పంచుకున్నారు. వ్యవసాయ రంగంపై అనేక అంశాల పట్ల చర్చలు జరిగాయి. వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడానికి అవసరమయ్యే సాంకేతిక వనరుల పట్ల ప్రత్యేక అధ్యయనం చేశారు. అదేవిధంగా పలు ప్రదర్శనలు ఏర్పాటు చేసి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి యూనివర్సిటీ అధ్యాపకులు, ఏరువాక ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు, వ్యవసాయ రంగ నిపుణులు పాల్గొన్నారు.













ఇస్తారా.. ఇంకా జాప్యం చేస్తారా?

▸▸ డబుల్ ఇళ్ల పంపిణీ ఇప్పట్లో లేనట్లేనా..! ▸▸ సందిగ్ధంలో దరఖాస్తుదారులు

తాండూరు, జనవరి 21 : పేదల కోసం గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూంల పంపిణీపై సందిగ్ధత ఏర్పడింది. తమకు ఇళ్లు ఎప్పుడిస్తారోనని లబ్ధిదారులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. తాండూరు-వికారాబాద్ మార్గంలో ఖాంజాపూర్ గేట్ వద్ద గత ప్రభుత్వం కేసీఆర్ నగర్ పేరుతో ఇక్కడ డబుల్‌బెడ్‌రూంల నిర్మాణం చేపట్టింది. గతేడాది ఏప్రిల్‌లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, పరిశీలించేంత వరకు సక్రమంగా జరిగినా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పంపిణీకి బ్రేక్ పడింది. ఇంతలో ప్రభుత్వం మారటంతో డబుల్ బెడ్‌రూంలు పంపిణీ చేస్తారా.. ఇంకా జాప్యం చేస్తారా.. అన్న చర్చ జరుగుతోంది.

ఇప్పట్లో పంపిణీ లేనట్టే

పేదలకు డబుల్‌బెడ్‌రూంలను ఇవ్వాలని ఇటీవల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 34వ వార్డులో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని స్థానిక కౌన్సిలర్ సోమశేఖర్ కోరారు. బ్లాక్‌ల నిర్మాణం పూర్తయ్యాక అర్హులైన వారిని గుర్తించి పంపిణీ చేస్తామని ఆయన చెప్పడంతో నిర్మాణం పూర్తయిన డబుల్‌బెడ్‌రూంలు ఇప్పట్లో పంపిణీ జరిగే అవకాశాలు లేవని స్పష్టమవుతోంది.

ఆరేళ్లుగా సాగదీత..

2018లో ప్రారంభమైన పనులు.. 6 ఏళ్లు గడుస్తున్నా పూర్తికాలేదు.



1001 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు 581 ఇళ్లు పూర్తయ్యాయని సమాచారం. 5 బ్లాకుల పనులు స్లాబ్ స్థాయిలో ఉండగా, మరో 7 బ్లాకులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ ప్రభుత్వమైనా తమ సొంతింటి కలను నెరవేరుస్తుందని ప్రజలు ఆశతో ఉన్నారు. ఇటీవల ప్రజాపాలనలో కూడా తాండూరు మునిసిపాలిటీలో 9436 మంది డబుల్‌బెడ్‌రూంల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నారు.

'పార్లమెంట్' బరిలో మల్లు రవి

ఆమనగల్లు, జనవరి 21 : టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి కాంగ్రెస్ తరఫున నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి పోటీ సిద్ధమవుతున్నారు. గత ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మల్లు రవి విశేష కృషి సలిపారు. పార్టీ అధిష్ఠానం వద్ద మల్లుకు మంచి గుర్తింపు ఉంది. ఈనేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థిత్వంపై ఇప్పటికే భరోసాగా ఉన్నమల్లు పోటీకి తగిన వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఇందుకోసమే మల్లు రవిని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించినట్లు ప్రచారం సాగుతోంది. ఆ పదవి ద్వారా సునాయాసంగా ప్రజల్లోకి వెళ్లవచ్చన్న భావనతో కాంగ్రెస్ వర్గీయులు భావిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తే కేంద్రమంత్రిగా అవకాశాలున్నాయని తెలిసింది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం గ్రామస్థాయిలో కాంగ్రెస్‌కు మరింత బలం చేకూరింది. అదేవిధంగా పార్లమెంట్ పరిధిలో 5 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వారే ఉన్నారు. దాంతో గెలుపు సునాయాసమని మల్లు రవి ఒకింత ధీమాగా ఉన్నట్లు సమాచారం. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్‌తో పాటు మల్లుకు బలమైన అనుచర వర్గం ఉంది. నాగర్‌కర్నూల్ నుంచి 1991, 1998లో రెండు పర్యాయాలు మల్లు రవి ఎంపీగా గెలుపొందారు. గతంలో ఏఐసీసీ సభ్యుడిగా, 2004-2008 వరకు అప్పటి వైఎస్ ప్రభుత్వంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మల్లు పనిచేశారు. ఏఐసీసీ, యూత్ కాంగ్రెస్‌లోనూ ఆయన పలు పదవులు నిర్వహించారు. ఉన్నత విద్యావంతుడైన మల్లు రవికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సమస్యలపై మంచి అవగాహన ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, విశ్వసపాత్రుడిగా మల్లు రవికి పేరుంది. ఈనేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి మల్లు రవికి అభ్యర్థిత్వం సునాయాసమేనన్న భావన వ్యక్తమవుతోంది.


మల్లు రవికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మల్లు రవికి కాంగ్రెస్ నాయకుల సన్మానం

ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధిగా మాజీ ఎంపీ, పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి నియామకం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యనాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, బీచ్యనాయక్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని మల్లును కోరినట్లు తెలిపారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు


కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

ధారూరు, జనవరి 21 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆ పార్టీ జిల్లా నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శ్రీ అనంతపద్మనాభ స్వామి దేవస్థానం, అనంతగిరి గుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రూ. 100 కోట్లు కేటాయించి, నిధులు విడుదల చేయించిన కిషన్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అన్ని రంగాలలో వెనుకబడిన వికారాబాద్ జిల్లా అభివృద్ధికి సహకరించాలని మంత్రిని కోరినట్లు వారు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, నాయకులు నరోత్తంరెడ్డి, శ్రీధర్ ఉన్నారు. అనంతరం బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా, మహిళ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నియామకమయిన బొక్కా నర్సింహారెడ్డి, శిల్పారెడ్డిని కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

జాతీయస్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మేడ్చల్‌టౌన్, జనవరి 21 : జాతీయస్థాయి కరాటే పోటీల్లో మేడ్చల్ పట్టణం యూనివర్సెల్-369 మార్షల్ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పలువురు విద్యార్థులు గోల్డ్‌మెడల్స్‌ను సాధించారు. ఆదివారం నగరంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటారు. కటాస్ విభాగంలో కృపారాణి, రోజి, మేరి గోల్డ్‌మెడల్స్‌ను దక్కించుకోగా, అమూల్య, వినీషా సిల్వర్ మెడల్స్‌ను దక్కించుకున్నారు. మనోజ్ఞ, మైథిలిలు బ్రౌన్జ్‌మెడల్స్‌ను దక్కించుకున్నారు. స్పైరింగ్ విభాగంలో వరుణ్ తేజ్, రిషి, గోవింద్, వీరభద్ర, కృష్ణ ప్రియలకు గోల్డ్‌మెడల్ దక్కగా, చరణ్ సిల్వర్ మెడల్ దక్కించుకున్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనపరిచిన ఈ విద్యార్థులు ఈనెల 28న జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని, మరో 50 మంది విద్యార్థులు కూడా పాల్గొంటారని గ్రాండ్ మాస్టర్ పరమేష్, మాస్టర్ సాయికుమార్, అక్షయ్, జి.మంజుల తెలిపారు.


కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన మేడ్చల్ విద్యార్థులు

సౌత్‌జోన్‌లో.. సార్లరావులపల్లి బాలిక

కందుకూరు : మండలంలోని సార్లరావులపల్లి గ్రామానికి చెందిన జర్పుల భువనశ్రీ అనే బాలిక కరాటే(వుషు)లో సత్తాచాటి మూడవ బహుమతిని కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ముగింపు వేడుకల్లో నిర్వాహకులు ఆమెకు అందజేశారు. ఈనెల 18 నుంచి 21వరకు కోయంబత్తూరులో అండర్- 14 బాలికల విభాగంలో కరాటే (వుషు) పోటీలు జరిగాయి. కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. భువనశ్రీ సార్లరావులపల్లి గ్రామ సర్పంచ్ జె.రజితప్రవీన్‌నాయక్ కుమార్తె కావడం విశేషం. ఈ సందర్భంగా గ్రామంలో ఆదివారం సంబురాలను జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో కోచ్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో బెల్ట్ ప్రమోషన్ టెస్ట్

కీసర రూరల్ : నాగారం మునిసిపాలిటీలోని శివసాయి గార్డెన్‌లో ఆదివారం చిదంబ్ తైక్వాండో ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ నిర్వహించారు. 200మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. గెలుపొందిన విద్యార్థులకు బెల్ట్‌తో పాటు సర్టిఫికెట్స్‌ను అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగారం పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు గూడూరు ఆంజనేయులు మాట్లాడుతూ కరాటేతో చిన్నారుల్లో మనోధైర్యం పెరుగుతుందన్నారు. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్‌కుమార్, చిదంబ్ తైక్వాండో సంస్థ నిర్వాహకుడు నందకిషోర్, పాల్గొన్నారు.



బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతులమీదుగా విశిష్ట అధ్యాపక అవార్డు అందుకుంటున్న మహిపతి శ్రీనివాస్‌రావు

'అనురాగ్' అధ్యాపకుడికి 'విశిష్ట' అవార్డు

ఘట్‌కేసర్ రూరల్ జనవరి 21 : నైపుణ్యం కలిగిన అధ్యాపకులు ఉన్నప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జనగా ఎమ్మెల్యే, అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. నగరంలోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో శనివారం రాత్రి అంబిషన్స్ కెరీర్ కౌన్సిల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకుడు మహిపతి శ్రీనివాస్‌కు విశిష్ట అధ్యాపక అవార్డును పల్లా రాజేశ్వర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యాసంస్థల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యవంతమైన అధ్యాపకులు ఉన్నప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. శ్రీనివాస్ రెండు దశాబ్ధాలుగా ఇంగ్లీష్ మాధ్యమంలో, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తూ విశిష్ట సేవలు అందిస్తున్నట్లు గుర్తుచేశారు. ఇంగ్లీషు ప్రాధాన్యత ఎంతో పెరిగిందని, విద్యార్థులు, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి దానిపై పట్టుసాధించాలని తెలిపారు. అవార్డు రావడం సంతోషంగా ఉందని మహిపతి శ్రీనివాస్ తెలిపారు. అనురాగ్ యూనివర్సిటీ సీఈవో నీలిమ, ఆయా విభాగాల డీన్లు, అంబిషన్స్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్‌ను అభినందించారు.

'బెల్టు' తీస్తారా.. కొనసాగిస్తారా..

గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు

పెద్దేముల్, జనవరి 21: గ్రామాల్లో బెల్టు షాపులు విచ్చల విడిగా కొనసాగుతున్నాయి. గల్లీకో బెల్టుషాపు ఉండడంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. ఎన్నికల సమయంలో దాడులు చేసి బెల్టుషాపులను అరికట్టిన ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, పోలీసులు ఇపుడు వాటి ఊసే ఎత్తడం లేదు. అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో బెల్టుషాపుల నిర్వాహకులు సొమ్ముచేసుకుంటున్నారు. మద్యం ప్రియుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని క్వార్టర్, బీర్‌బాటిళ్ల ఒక్కోదానిపై రూ. 20 నుంచి రూ.30 చొప్పున అధనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అదేంటని ప్రశ్నిస్తే.. మందుకావాలంటే అందరిని చూసుకోవాలి కదా.. అని దబాయిస్తున్నారని పలువురు చెబుతున్నారు. మండలంలో 37 గ్రామపంచాయతీలు, 10 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అర్ధరాత్రి వెళ్లి తలుపుతట్టినా మద్యం దొరుకుతుండడంతో మద్యం ప్రియులకు అడ్డు, అదుపులేకుండా పోతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బెల్టుషాపులు పచ్చని సంసారాల్లో చిచ్చుపెట్టి, కుటుంబంలో కలహాలు రేగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మద్యం విక్రయాలను నిలిపివేయడంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కనిపించింది. అనంతరం మళ్లీ బెల్టుషాపులు మొదలయ్యి, విక్రయాలు జోరందుకున్నాయి. బెల్టుషాపుల నిర్వాహకులను వైన్‌షాపుల యజమానులే ప్రోత్సహిస్తున్నారిని, ఎవరు వచ్చినా తాము చూసుకుంటామని వారికి ధైర్యంచెప్పి ప్రోత్సహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్పందించి బెల్టుషాపులను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కేటీఆర్

మేడ్చల్ టౌన్ , జనవరి 21 : గుండ్లపోచంపల్లికి చెందిన బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఆదివారం తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా గోల్డ్‌స్టోన్ స్కూల్ క్యాలెండర్‌ను కేటీఆర్ ఆవిష్కరించారు. కేటీఆర్‌ను కలిసిన మేడ్చల్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వారిలో ఉన్నారు.


ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు బీజేపీలో చేరారు. ఆదివారం చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈమేరకు ఆయన కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు.

కంకరవేశారు.. బీటీ మరిచారు

యాలాల, జనవరి 21 : ఆర్ అండ్ బీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం కారణంగా ప్రయాణికులు అష్టకష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. బెన్నూరు-లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా మధ్య రోడ్డుపై కంకరవేసి వదిలేయడమే దానికి నిదర్శనం. బెన్నూరు నుంచి లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా పాడైపోయింది. దీంతో అధికారులు మూడు నెలల క్రితం రోడ్డు మరమ్మత్తు పనులను చేపట్టారు. రోడ్డును తవ్వి కంకరవేశారు, కానీ తారు వేయకపోవడంతో మండల కేంద్రానికి, గోరేపల్లి, దేవనూర్ గ్రామాలకు వెళ్ళే ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంకర తేలిన రోడ్డుపై ప్రయాణించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహన దారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కంకర పరిచిన రోడ్డును వెంటనే తారు రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.


బెన్నూరు లక్ష్మీ నారయణపూర్ చౌరస్తా మధ్య రోడ్డుపై వేసిన కంకర


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎన్డీఎఫ్‌డీసీ సీఎండీ, సంయుక్త కార్యదర్శి నవీన్‌కుమార్‌షా

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

▸▸ ఎన్డీఎఫ్‌డీసీ సీఎండీ, సంయుక్త కార్యదర్శి నవీన్‌కుమార్‌షా

కీసర రూరల్, జనవరి 21 : ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్డీఎఫ్‌డీసీ సీఎండీ, సంయుక్త కార్యదర్శి నవీన్‌కుమార్‌షా అన్నారు. ఆదివారం నాగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా లభించే రుణాలు, ఆర్థిక సహాయం గురించి వివరించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, నోడల్ ఆఫీసర్, కెనరా బ్యాంక్ మేనేజర్ అనిల్ కుమార్, చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పాల్గొన్నారు.

కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు

- 'మైక్రో ఇరిగేషన్ స్కీమ్' కింద డ్రిప్ పరికరాల కోసం రైతుల ఎదురుచూపు
- ఐదేళ్లుగా అందించని వైనం.. ఆయిల్‌పామ్ సాగుకే పథకం పరిమితం
- ప్రైవేటుగా కొనుగోలు.. సబ్సిడీపై అందించాలని అన్నదాతల విన్నపం

చేవెళ్ల, జనవరి 21 : రాష్ట్రంలో కొత్తగా అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా రైతులకు మైక్రో ఇరిగేషన్ స్కీమ్ కింద డ్రిప్ పరికరాలు అందజేస్తారని గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. బిందు సేద్యం ద్వారా పంటలకు సరిపడా నీరందించేందుకు వీలుగా ప్రభుత్వం సబ్సిడీపై అందించే డ్రిప్ పరికరాలు గత ఐదేళ్లుగా అందడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని కేవలం ఆయిల్‌పామ్‌కు పరిమితం చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, కొత్తగా అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు ఆశలు పెంచుకుంటున్నారు. సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందిస్తుందన్న నమ్మకంతో ఎదురుచూస్తున్నారు.



చేవెళ్ల మండలంలో డ్రిప్‌తో సాగుచేసిన క్యాబేజీ పంట

గతంలో సబ్సిడీపై డ్రిప్ పరికరాలు

పంటల సాగులో నీటి వృథాను తగ్గించి తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంతో ఆరుతడి పంటలు సాగు చేసుకునేందుకు డ్రిప్ పరికరాలు చాలావరకు దోహదపడుతున్నాయి. డ్రిప్ ద్వారా అన్నిరకాల కూరగాయల సాగుతో పాటు వివిధ రకాల పండ్ల తోటలకు సైతం సరిపడా నీరు అందిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదేళ్ల నుంచి డ్రిప్ పరికరాలు అందించ లేదు. అయితే, బీఆర్ఎస్ కన్నా ముందున్న ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతంపై సబ్సిడీ ఇవ్వగా.. పెద్ద రైతులకు 12 ఎకరాలకే పరిమితం చేయడంతో పాటు 80 శాతం మేర సబ్సిడీ అందజేశాయి.

డ్రిప్‌తో సాగుచేసే పంటలు

గతంలో అన్ని రకాల పంటలకు ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందించింది. చేవెళ్ల డివిజన్‌లోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లో ప్రధానంగా మొక్కజొన్న, పూలతోటలతో పాటు, అన్నిరకాల కూరగాయలు, పండ్ల తోటలకు డ్రిప్ పరికాలు అందించడంతో నీటి ఆదాతో పాటు కూలీల ఖర్చు కూడా తగ్గింది. ప్రభుత్వం కేవలం ఆయిల్‌పామ్ రైతులకే డ్రిప్ పరికరాలు అందించడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రైవేట్‌గా డ్రిప్ పరికరాల కొనుగోలు

ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందించడం నిలిపి వేయడంతో రైతులు విధిలేని పరిస్థితిల్లో ప్రైవేట్‌గా కొనుగోలు చేసుకుంటున్నారు. అయితే, ప్రైవేట్ కంపెనీలు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో హెక్టార్‌కు 10 శాతం రైతు చెల్లిస్తే 90 శాతం ప్రభుత్వం రాయితీపై డ్రిప్ అందించేది. కానీ, ఆ పరిస్థితి లేకపోవడంతో రైతులు ఎకరాకు రూ.20 నుంచి 30వేలు వరకు ఖర్చు చేసి డ్రిప్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు.

రైతులకు ఎంతో ఉపయోగం



ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నీటి వృథా తగ్గడంతో పాటు ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసే అవకాశం ఉంటుంది. పలు రకాల పంటలను డ్రిప్‌తో సాగు చేస్తున్నాం. కొత్త ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందించాలి.

- రంగారెడ్డి, రైతు, మల్కాపూర్

డ్రిప్ పరికరాల కోసం ఎదురుచూపు



ప్రభుత్వం అందించే డ్రిప్ పరికరాల కోసం ఎదురుచూస్తున్నాం. గత ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తున్నాం. కొత్త ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

- వై.నర్సింలు, రైతు, చేవెళ్ల

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు దుర్మరణం

- మరొకరి పరిస్థితి విషమం.. బైక్‌పై వస్తుండగా ప్రమాదం



కరుణాకర్ (ఫైల్)

యాచారం, జనవరి 21 : ఆర్టీసీ బస్సు-బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేడిపల్లి చెరువుకట్టపై జరిగింది. ఇద్దరు యువకులు బైక్‌పై వెళుతుండగా.. ఎదురుగా వస్తున్న ఆ ర్టీసీ బస్సును ఢీకొనడంతో ఓ యువకుడు మరణించగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం రాత్రి మల్కీజ్‌గూడ గ్రామానికి చెందిన ఆలంపల్లి కరుణాకర్(19) మేడిపల్లికి చెందిన చిందం బాషయ్య(39)లు బైక్‌పై మేడిపల్లికి వస్తున్నారు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. దాంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. కరుణాకర్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. బాషయ్య పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామాంజనేయులు తెలిపారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న కేటీఆర్

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి



మహేశ్వరం, జనవరి 21 : కాంగ్రెస్ ప్రజాపాలనపై ప్రజల్లో ఆదరణ చూసి ఓర్వలేని మాజీ మంత్రి కేటీఆర్ మతి భ్రమించి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనవరి నెలకు సంబంధించిన కరెంటు బిల్లులు ఎవరూ కట్టవద్దని కేటీఆర్ చెప్పడం అవివేకం అని అన్నారు. ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా 200 వందల యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల పట్ల ప్రజలకు ఎలాంటి సందేహాలు అవసరం లేదని, ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణ చూసి ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఉచిత ఎరువుల పంపిణీ, దళితబంధు, బీసీబంధు, దళితులకు 3 ఎకరాల వ్యవసాయ భూమి, ఇంటికో ఉద్యోగం వంటి ఎన్నో హామీలు ఇచ్చారని అందులో ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు. కేవలం అధికారంలోకి వచ్చి రెండు మాసాలు కూడా పూర్తికాని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్న కేటీఆర్‌ను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. ఇప్పటికే రెండు హామీలను అమలు చేసి సుపరిపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్లేనని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో లక్షల కోట్ల అవినీతికి పాల్పడిందన్నారు. అందుకే అధికారం చేజారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎవరు ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని పాండురంగారెడ్డి తెలిపారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, గోలి శ్రీనివాస్‌రెడ్డి

జానకమ్మ మృతి పట్ల సంతాపం

ఆమనగల్లు, జనవరి 21 : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వట్టెం శ్రీనివాసరావు మాతృమూర్తి జానకమ్మ మృతి పట్ల మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిలు సంతాపం తెలిపారు. మాడ్గుల మండలం ఆవురుపల్లిలో జానకమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుమారులు శ్రీనివాసరావు, మురళీధర్ రావులను పరామర్శించారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ వట్టెం వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు లాలయ్యగౌడ్, కామినేని ఆసుపత్రి పీఆర్‌వో వట్టెం విజయభాస్కర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుభాష్, నాయకులు శ్రీను, యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, సుమన్ నాయక్, శివ, సతీష్, రామచంద్రయ్య, అంజయ్య, శ్రీనివాసులు, వీరయ్య, రాజేశ్, మహేశ్, వెంకటనారాయణ, రాజు, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

- మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

కందుకూరు, జనవరి 21 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు సత్తారు రవికుమార్‌రెడ్డి తోకల ధనంజయగౌడ్‌ల ఆధ్వర్యంలో పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డితో కలిసి కేఎల్లార్ సమక్షంలో పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. కాంగ్రెస్ నాయకులు అందుగుల సత్యనారాయణ, మధన్‌పాల్‌రెడ్డి, జగదీష్‌బాబు, కృష్ణయ్య పాల్గొన్నారు. కర్నాటి కుమార్, తోలక సునీల్‌గౌడ్, కె.శ్రీనివాస్, డి.నర్సింహ, టి.వీరేష్, మాధవరెడ్డి, మణిరత్నం, శ్రీకాంత్, సురేష్, రవితేజ తదితరులు పార్టీలో చేరారు.



కేఎల్లార్ సమక్షంలో పార్టీలో చేరుతున్న కొత్తూరు గ్రామ బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణ సాధనలో ఉద్యమకారుల పాత్ర కీలకం



భీంభరత్‌కు ఆహ్వాన పత్రం ఇస్తున్న నాయకులు

షాబాద్, జనవరి 21 : ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర కీలకమని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. ఆదివారం ఉద్యమకారుల సంఘం నాయకులు పామెన భీంభరత్ నివాసంలో ఆయన్ను కలిసి ఫిబ్రవరి 4న చేవెళ్ల పార్లమెంట్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తరఫున కృతజ్ఞతా సభకు రావాలని ఆహ్వానపత్రిక అందజేశారు. ఉద్యమకారుల ఫోరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్ చార్జి రాములు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, ఉద్యమకారుల ఫోరం షాబా ద్ మండలాధ్యక్షుడు కుమ్మరి చెన్నయ్య, మొయినాబాద్ అధ్యక్షుడు మహిపాల్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌గౌడ్, శివకుమార్, రమేష్, వెంకటేష్, సత్యనారాయణగౌడ్, నర్సింహులు, సత్యనందం పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవా సంఘం మండలాధ్యక్షుడిగా నర్సింగ్‌రావు

ఇబ్రహీంపట్నం, జనవరి 21: ఇబ్రహీంపట్నం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండి నర్సింగ్ రావు, ఉపాధ్యక్షులుగా రెడిమల్ల యాదయ్య, భర్తాకి యాదగిరి, బోడ సత్తయ్య, ఆముదాల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా కొలుకులపల్లి క్రాంతికుమార్, కోశాధికారిగా బుద్ధి దీపక్, సహాయ కార్యదర్శులుగా జెట్టి శ్రీహరి, శ్రీనులను ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న కాసు శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు , జనవరి 21: తలకొండపల్లి మండలం గౌరిపల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయ నిర్మాణానికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాస్ రెడ్డి చేయూతనందించారు. ఆదివారం ఆలయ నిర్వాహకులకు రూ.30 వేలు విరాళం అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డిని నిర్వాహకులు, స్థానికులు అభినందించారు. పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, దేవుని పడకల్ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం, గౌరిపల్లి సర్పంచ్ అనురాధ నరేందర్, నాయకులు బాల్‌రెడ్డి, మధు, సురేందర్ రెడ్డి, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలి



మొయినాబాద్ రూరల్ : పాదయాత్రకు స్వాగతం పలుతున్న గోపాల్‌రెడ్డి, తదితరులు

మొయినాబాద్ రూరల్, జనవరి 21 : ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు గున్నాల గోపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయంలోని శివాలయం ప్రధాన అర్చకుడు సురేష్ పంతులు వారం క్రితం అయోధ్యలోని రామాలయం నుంచి పాదుకలతో చిలుకూరు బాలాజీ దేవాలయానికి ఆదివారం పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డితో పాటు పలువురు హిందూ సంఘాల నాయకులు వారికి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కాగా, ఈ పాదయాత్ర చిలుకూరు బాలాజీ దేవాలయంలోని శివాలయం వరకు సాగింది. అనంతరం ప్రత్యేక పూజలు చేసిన సురేష్ పంతులు యాత్రలో సహకరించిన ప్రతీ ఒక్కరిని ఆశీర్వదించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



షాబాద్ : అంతారం గ్రామంలో అక్షింతలు పంచుతున్న యువకులు

రామనామ స్మరణతో మార్మోగిన అంతారం

షాబాద్ : అయోధ్యలో భవ్య రామ మందిర నిర్మాణంతో దేశ ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని హిందూవాహిని సంఘం నాయకులు అన్నారు. ఈమేరకు ఆదివారం ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలుచేసి ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన చరిత్రాత్మక ఘట్టమని, దాన్ని వీక్షించేందుకు దేశ విదేశాల ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని అన్నారు. విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రతి ఒక్కరూ పండుగలా జరుపుకోవాలని కోరారు. సోమవారం అంతారం గ్రామంలో శోభాయాత్ర ఉంటుందని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పండుగలా జరుపుకోవాలి : బండారి రమేశ్



షాద్‌నగర్ : అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రజలు పండుగలా జరుపుకోవాలని విశ్వ హిందూ పరిషత్ నేత బండారి రమేశ్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హిందువుల 500 ఏళ్ల పోరాటం, లక్షలాది మంది విశ్వహిందూ పరిషత్ కరసేవకుల బలిదానం ఫలితంగానే అయోధ్యలో రామమందిర నిర్మాణం జరుగుతుందన్నారు. విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం దేశమంతా బాణసంచా కాలుస్తూ దీపావళి సంబురాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని నేడు(సోమవారం) ఉదయం శ్రీరామ భక్తులంతా సమీపంలోని ఆలయాలకు చేరుకొని హనుమాన్ చాలీసా, శ్రీరామ భజనలు చేపట్టాలని సూచించారు. అయోధ్యలో కార్యక్రమం పూర్తికాగానే శ్రీరాముడి అన్న ప్రసాదాలను తీసుకోవాలన్నారు. యావత్ ప్రపంచం అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న ఘడియలు సమీపించడం హర్షణీయమని అన్నారు.

నేడు అన్నోజిగూడలో ఎమ్మెల్యే సబిత పర్యటన

కందుకూరు, జనవరి 21 : మండలంలోని అన్నోజిగూడలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి నేడు(సోమవారం) మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి వస్తున్నట్లు జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు ఉదయం 10:30గంటలకు అన్నోజిగూడలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం, అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు బీఆర్ఎస్ నాయకులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

ఆమనగల్లు, జనవరి 21: కడ్తాల, ఆమనగల్లు, తలకొండపల్లి , మాడ్గుల మండలాల పరిధిలో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా మండలాల పరిధిలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎల్వోలు కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ఆర్డీవో శ్రీను, ఆమనగల్లు తహసీల్దార్ లలిత, కడ్తాల తహసీల్దార్ ముంతాజ్‌లు తెలిపారు. ఆదివారం కూడ అన్ని పోలింగ్ బూత్‌లలో కొత్త ఓటర్లను నమోదుకు దరఖాస్తులు స్వీకరించడం జరగుతుందని వెల్లడించారు. ఓటర్ల జాబితాలో సవరణలకు దరఖాస్తు చేసుకోవచ్చని శ్రీను, లలిత, ముంతాజ్‌లు సూచించారు.

విద్యతోనే సమాజంలో మార్పు

ఆమనగల్లు, జనవరి 21 : జ్ఞాన సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరు ముందుకు సాగాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వగ్గు మహేశ్, పూలే బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోలి నర్సింహులు అన్నారు. విద్య ద్వారానే పేదల జీవితాల్లో మార్పు సాధ్యమని తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని నవచైతన్య కాలనీలో అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులతో కలిసి మహేశ్, నర్సింహులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్ఞాన ప్రచార సభ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వారు అభినందించారు. నాయకులు జంతుక శంకర్, భాస్కర్, వగ్గు వినయ్, దేవేందర్, గిరి, మహేశ్, జగదీశ్, సురేశ్, కుమార్, ఈరమ్మ, ఎల్లమ్మ, మమత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మంచాల, జనవరి 21 : మండలంలోని జడ్పీ హైస్కూల్ 1988-89 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఇబ్రహీంపట్నంలోని ఓ గార్డెన్స్‌లో కార్యక్రమం నిర్వహించగా 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పటి అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సమ్మేళనానికి అధ్యక్షత వహించిన పూర్వవిద్యార్థి సీహెచ్ చక్రపాణిని సత్కరించారు. అధ్యాపకులు ప్రహ్లాద్, మాధవరెడ్డి, నర్సింహారెడ్డి, ఖాజాపటేల్, శివకుమార్‌తో పాటు నేముల, జాపాల, చాంద్‌ఖాన్‌గూడ, అస్మత్‌పూర్, మంచాల, చిత్తాపూర్, తిప్పాయిగూడ, లింగంపల్లికి చెందిన పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



సామాజిక సేవలో లయన్స్‌క్లబ్‌కు అంతర్జాతీయ ఖ్యాతి



ఆమనగల్లు : పండ్లు పంపిణీ చేస్తున్న జూలూరి రమేశ్

ఆమనగల్లు, జనవరి 21: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వాహణలో లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలిచిందని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ జూలూరి రమేశ్ అన్నారు. సమాజ సేవా కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. పలు చోట్ల మొక్కలు నాటారు. బస్టాండ్ ఆవరణలో బుచ్చిరెడ్డి స్మారకార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను లయన్స్‌క్లబ్ జోన్ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌తో కలిసి రమేశ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వార్థ చింతన లేని సేవలకు సమాజంలో చిరస్థాయి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరు ఉన్నంతలో పరులకు సాయమందించాలని రమేశ్ కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సంయుక్త కార్యదర్శి ఎంగళి బాలకృష్ణ, పీఆర్‌వో ఎంఏ పాష, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

కందుకూరు : అన్నం పరబ్రహ్మ స్వరూపమని లయన్స్‌క్లబ్ పాస్ట్ గవర్నర్ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. కందుకూరు, ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో(వారాంతపు సంత)లో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆకలితో ఉన్న వ్యక్తికి ఆహారం అందించడం కన్న గొప్ప సేవ ఏదీ లేదన్నారు. జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్ గుర్తించిన గ్లోబల్ కార్యక్రమంలో ఆకలి నిర్మూలన ఒక కార్యక్రమన్నారు. 200 మందికి అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆ క్లబ్ మండలాధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, కార్యదర్శి కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్త, సుధాకర్ రెడ్డి, ఆమనగల్లు కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, జి.రమేష్, బిచ్చా నాయక్, వెంకటేష్, రాజు, లక్ష్మయ్య తదితరులున్నారు.



కందుకూరు: అన్నదానం చేస్తున్న చెన్నకిషన్‌రెడ్డి

అట్టహాసంగా స్వర్ణకారుల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న వింజమూరు రాఘవాచారి

ఆమనగల్లు, జనవరి 21 : ఆమనగల్లు మండల స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం, స్వర్ణకారుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలను ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక కళ్యాణి గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరు రాఘవాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణచారి, రాష్ట్ర కార్యదర్శి చారి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆమనగల్లు స్వర్ణకారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కాసోజు రాము ఉపాధ్యక్షులు చింతోజు వివేకానంద చారి, కర్నె కంటి రామాచారి, గౌరవ అధ్యక్షులు పాలోజు బ్రహ్మాచారి, సహాయ కార్యదర్శి దార్ల కిరణ్, కార్యవర్గ సభ్యులు బ్రహ్మాచారి, రంగాచారి, మధుచారి, సాంబమూర్తి, సుదర్శనాచారి, వెంకటేశ్, యాదగిరి, జగన్, దాసోజు వెంకటేశ్, పి.వెంకటేశ్, సలహా దారులు రామచంద్రయ్య, రాజేశ్వర్, శ్రీనివాస్, శ్రీనివాసాచారి, జగదీశ్వలతో రాష్ట్ర అధ్యక్షుడు రాఘవాచారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం కొనసాగింది. ఆటపాటలతో స్వర్ణకారుల కుటుంబాలు సందడి చేశాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరు రాఘవాచారి మాట్లాడుతూ హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి స్వర్ణకారులు సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్య, ఉపాధి, ఉద్యోగ, సామాజిక, రాజకీయ రంగాల్లో స్వర్ణకారులు మరింతగా రాణించాలని కోరారు. స్వర్ణకారులకు అన్నిపార్టీలు రాజకీయంగా గుర్తింపునివ్వాలని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అవకాశాలు కల్పించాలని రాఘవాచారి డిమాండ్ చేశారు. ఆమనగల్లులో స్వర్ణకారుల కేటాయించిన స్థలంలో త్వరలో శ్రీ విరాట్ పోతూలూరు వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయాన్ని నిర్మిస్తామని చెప్పారు. తమ వంతు తోడ్పాటునందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్యదర్శులు కె.రమేశ్‌చారి, చారి, జిల్లా నాయకులు రామచంద్రయ్య, సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని సంఘం నాయకులు సత్కరించి అభినందించారు.

శిథిలావస్థకు గోదాం



ఆమనగల్లు, జనవరి 21 : ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ గోదాం శిథిలావస్థకు చేరుకుంది. ఐదు దశాబ్దాల క్రితం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గోదాంను నిర్మించారు. కాగా, ఏళ్లకాలంగా గోదాంను వినియోగించక, నిర్వాహణ కరువై నిరూపయోగంగా మారింది. క్రమంగా రేకులు, గోడలు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంటోంది. స్వల్ప మరమ్మతులు చేస్తే గోదాం వినియోగంలోకి వస్తుంది. సింగిల్ విండోకు కూడా అనువైన గోదాం లేదు. దీనికి మరమ్మతులు చేస్తే రైతులకు అనుకూలంగా ఉంటుంది. ఆదిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు, జనవరి 20: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌వో ఎండీ. పాష ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఎనుగొండ రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రి, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్ఎంపీ చంద్రారెడ్డి మృతి



తలకొండపల్లి, జనవరి 21: పడకల్‌కు చెందిన ఆర్ఎంపీ, ప్రముఖ సంఘసేవకుడు చంద్రారెడ్డి మృతిచెందారు. 25 రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. దేవుని పడకల్ అవేర్ ఆసుపత్రిలో రెండు దశాబ్దాల పాటు వైద్యసేవలందించి పేదల డాక్టర్‌గా పేరుగాంచాడు. తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.